## గ్రామ పంచాయతీలకు బతుకమ్మ చీరలు



బల్మూరులో జీపీలకు సరఫరా చేస్తున్న బతుకమ్మ చీరలు

బల్మూరు, అక్టోబర్4: బతుకమ్మ చీరలను జీపీలకు పంపిణీ చేశామని ఎంపీడీవో దేవన్న బుధవారం తెలిపారు. గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల అధ్యక్షతన త్వరలో ప్రజలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలం మొత్తానికి 11,660 బతుకమ్మ చీరలు అందాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నేడే వేలం నిర్వహణ

అచ్చంపేట టౌన్ అక్టోబర్ 4: అచ్చంపేట పట్టణంలోని పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని నీటి పారుదల శాఖ పురాతన భవనాల ఆవరణలో ఉన్న వేప చెట్లు, నీలగిరి చెట్లు తొలగించుటకు గురువారం ఉదయం 10.30 గంటలకు కార్యాలయం ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలంలో పాల్గొనదలచినవారు 4వ తేదీన సాయంత్రం దరఖాస్తు రుసుము రూ.50వేలు చెల్లించి, రశీదు పొందిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. వేలంలో పాల్గొని వేలం దక్కని వారికి దరఖాస్తు రుసుము రూ.2వేలు తిరిగి ఇవ్వబడదని తెలిపారు. వేలం నందు పాల్గొను వారు ఎవరైతే అత్యధిక పాట పాడి డిపాజిట్ పోను మిగిలిన డబ్బులు కార్యాలయం నందు చెల్లించి రశీదు పొందగలరని తెలిపారు. చెట్ల వేలం పొందిన వారు వర్క్ ఆర్డర్ పొందాలని తెలిపారు. వేలం పాట పాడిన తదుపరి డబ్బులు పూర్తిగా చెల్లించి చెట్ల కలప తీసుకొని వెళ్లవలెనని తెలిపారు. పురపాలక సంఘం నిర్ణయించిన ధర రాని యెడల వేలము వాయిదా వేయు అధికారము కమిషనర్ ఉంటుందని తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం ఎవ్వరు ఏవిధమైన ఆక్షేపణలు చేసిన చెల్లవని తెలిపారు.

## ఆర్డీటీ ఆధ్వర్యంలో శ్రమదానం



సింగారంలో ప్రధాన వీధులను శుభ్రం చేస్తున్న రైతులు

అచ్చంపేట రూరల్, అక్టోబర్4: రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్ డీ టీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని సింగారంలో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా శ్రమ దానం చేసి ప్రధాన వీధుల్లో రోడ్లు ఊడ్చి బ్లీచింగ్ పౌడర్ చల్లినట్లు ఆర్డీటీ శ్రీశైలం రీజియన్ ఎస్‌టీఎల్ సిద్దప్ప తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎస్టీవో గువ్వని నరేశ్ మాట్లాడుతూ సింగారం గ్రామాన్ని భూ అభివృద్ధి విభాగంలో దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. సంస్థ సహకారంతో సబ్సిడీపై 150 మంది రైతులకు భూమి చదును పనులు, 10మందికి మైక్రో డ్రిప్ ,15మంది పాడి పరిశ్రమ మహిళలకు గేదెలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఒంటరి మహిళలు నలుగురికి రూ.55వేల వ్యయంతో ఉచితంగా గేదెలను కొనివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ పై అవగాహన కల్పించాలి

అచ్చంపేటరూరల్, అక్టోబర్4: ఎయిడ్స్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ఎయిడ్స్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఇంచార్జిడిప్యూటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం ఏరియా దవాఖానలో సంపూర్ణ సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం సీటీసీ కేంద్రాన్ని సందర్శించి సమీక్ష నిర్వహించారు. కేసులు ఎక్కువగా ఉన్న ఏరియాలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. హెచ్ ఐ టెస్టు లు , పాజిటివ్ కేసుల వివరాల రికార్డులను పరిశీలించారు. భార్యభర్తలలో ఏ ఒక్కరికీ హెఐవీ ఉన్నా ఇద్దరు పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రతి గర్భిణి తప్పని సరిగా హెచ్ ఐ వీ టెస్టులు చేయించుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్టులు ఏ ఆర్ టీ రిట్రో వైరల్ తెరఫి తీసుకోవాలన్నారు. సరైన పౌష్టికాహారం తీసుకోని క్రమం తప్పకుండా వ్యాయమం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీశైలం, డివిజన్ ఉపమలేరియా అధికారి ఆశోక్ ప్రసాద్, హెల్త్ఎడ్యుకేటర్ శ్రీను,ల్యాబ్ టెక్నిషియన్ అనూరాధ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు బతుకమ్మ చీరల పంపిణీ

అచ్చంపేట, అక్టోబర్ 4: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్ల పంపిణీ ప్రారంభించనున్నారు. అనంతరం మండలాల్లో అధికారులు పంపిణీ చేయనున్నారు.

# అభివృద్ధిపథాన కాలనీలు



పాత బజారులో పూర్తయిన సీసీ రోడ్డు నిర్మాణం

అచ్చంపేటటౌన్, అక్టోబర్ 4: అచ్చంపేట పట్టణంలోని కాలనీల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. దీంతో కొత్తకళను సంతరించుకున్నాయి. 15వ వార్డులో పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. వార్డులోని మురికి కాలువల నిర్మాణానికి దాదాపు రూ.50 లక్షలు వెచ్చించారు. ఉట్ల కోనేరు నుంచి సీసీ రోడ్డు, మురికి కాలువల నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు శంకుస్థాపన చేసి, త్వరగా పూర్తి చేసేలా అధికారులను పురమాయించారు. పాత బజారు చౌరస్తా నుంచి ఉట్ల కోనేరు వరకు దాదాపు 30 ఫీట్ల వెడల్పు గల సీసీరోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసుకొని ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అచ్చంపేట పట్టణానికి మూలం పాతబజారు. ఎలాంటి కార్యక్రమాలు జరిగినా బోనాలు, గంధోత్సవం, ప్రభ, పీర్ల పండుగ ఎంతో ఆర్భాటంగా జరుపుకుంటారు. ఎంతో సందడిగా సాగుతుంది. గత ప్రభుత్వాల హయాంలో ఏ కార్యక్రమం తలపెట్టినా రోడ్డుపై మొరం పోయడం తిరిగి రెండు రోజులకే కనుమరుగు కావడం ఆనవాయితీగా ఉండేది. ప్రస్తుతం తెలంగాణా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాత బజారు కొత్త బజారుగా రూపుదిద్దుకున్నది. రోడ్ల నిర్మాణా పనులలో నాణ్యత, మురికి కాలువల నిర్మాణ పనులలో నాణ్యతతో ఉండాలని ప్రభుత్వ విప్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వేసవికాలం వచ్చింది అంటే నీళ్ళ ట్యాంకరు కోసం ఎదురు చూసి ఖాళీ బిందెలతో నీటి కోసం కొట్లాడే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ప్రతి ఇంటింటికీ మిషన్ భగీరథ నీటి కనెక్షన్ ఇచ్చి నీళ్ల కష్టాలను తొలగించారు. విద్యుత్ కష్టాలనూ తొలగించారు.

### నీళ్ల కష్టాలు తీర్చిన సీఎం..



పట్టణంలోని 15వ వార్డులో 25 ఏండ్లుగా మేము నివాసం ఉంటున్నాము. ఏటా ఎండా కాలం వచ్చిందంటే నీటి ఎద్దడితో సతమతమయ్యే వాళ్లం. ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేవారు. అదేవిధంగా మురికి నీరు కాలువలు లేక రోడ్డుపైన పారుతూ ఉండేది. దీనివల్ల దోమలు ప్రబలి అనారోగ్య సమస్యలు తలెత్తేవి. వర్షాకాలంలో నీళ్లు ఇంటి ముందర, రోడ్డుపై నిలిచి రాకపోకలకు అంతరాయంగా ఉండేది. ప్రస్తుత ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చొరవతో సీసీరోడ్డు, కాల్వల నిర్మాణం పూర్తయింది. ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు అందిస్తున్నారు. మా నీటి కష్టాలను తీర్చిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాము.

–కె. కల్పన, గృహిణి, 15వ వార్డు

### కేసీఆర్ మళ్లీ రావాలి..



ప్రతి రాజకీయ నాయకుడు పథకాల హామీలు ఇస్తాడు కానీ, అది అమలు అయ్యే విధంగా కృషి చేసే నాయకుడు మనకు కావాలి. అది మన ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సాధ్యమైంది. ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయి. అధికారులు అలసత్వం వహించకుండా చూస్తున్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఏదో రూపంలో లబ్ధిపొందుతున్నారు. మహిళలను కూడా ఆదుకుంటున్న బీఆర్ఎస్‌ను ప్రజలు మళ్లీ ఆదరిస్తారు.

– కె.సంధ్య, గృహిణి, 15వ వార్డు

# అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి



ఆదర్శనగర్‌లో పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్

అచ్చంపేట, అక్టోబర్ 4: అచ్చంపేట మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆదర్శనగర్‌లో కొనసాగుతున్న సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలించారు. కాలనీలో మున్సిపల్ సిబ్బందిచే పర్యవేక్షించి పనులు పర్యవేక్షించారు. కాలనీవాసులతో పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తన నిధుల నుంచి రూ. 10కోట్లు కేటాయించి, పనులు మంజూరు చేయడంతో పట్టణంలోని అన్ని వార్డుల్లో పనులు కొనసాగుతున్నాయని అన్నారు. వార్డులలో కొనసాగుతున్న పనులను నాణ్యతగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అన్ని వార్డుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయని, ఆ పనులను మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని అన్నారు. ప్రజలు సహకరిస్తే పనులు వేగవంతంగా పూర్తి చేసుకోవడం జరుగుతుందన్నారు. మిగిలిన పనులను పూర్తి చేసుకునేందుకు మరో రూ.5కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీ పనుల కోసం టెండర్‌కు పంపించడం జరిగిందన్నారు. అట్టి రూ.5కోట్ల పనులు టెండరు పూర్తైయితే మరింత అభివృద్ధి వేగవంతం చేయడం జరుగుతుందన్నారు. పట్టణం గతంలో లేనంతగా అభివృద్ధి జరిగిందన్నారు. అన్ని వర్గాలకు కమ్యూనిటీ స్థలాలు కేటాయించి భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించామని కొన్ని కమ్యూనిటి భవనాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆయన వెంబడి మండల రైతు సమితి అధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డి, ఉస్సేన్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## తుది ఓటరు జాబితా విడుదల

### నియోజకవర్గంలో 2,33, 565మంది ఓటర్లు

అచ్చంపేట, అక్టోబర్ 4: అచ్చంపేట నియోజకవర్గానికి సంబంధించిన తుది ఓటరు జాబితాను గురువారం రెవెన్యూ అధికారులు విడుదల చేశారు. అచ్చంపేట నియోజకవర్గంలో కొత్త ఓటర్ల సంఖ్య భారీగానే పెరిగాయి. నియోజకవర్గంలోని 8మండలాల్లో మొత్తం 2,33,565మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 1,17,124 మంది, మహిళలు 1,16,439మంది, ఇద్దరు ట్రాన్స్‌జెండర్స్ ఓటర్లు ఉన్నారు. వంగూరు, అచ్చంపేట మండలాల్లో ఒక్కొక్క ట్రాన్స్‌జెండర్ ఓటర్లుగా ఉన్నారు. ఉప్పునుంతల మండలంలో పురుషుల కన్నా మహిళలే 253మంది ఓటర్లు అధికంగా ఉన్నారు. నియోజకవర్గంలో మహిళల కన్నా పురుషులు 685 ఓటర్లు అధికంగా ఉన్నారు. అన్ని తసీల్దార్ కార్యాలయాల్లో తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. నేటి నుంచి బీఎల్‌వో కేంద్రాలకు పంపించనున్నారు. అయితే బీఎల్‌వోలుగా ఉన్నా అంగన్‌వాడీలు సమ్మెలో ఉన్నందున ఎవరిద్వారా బీఎల్‌వో కేంద్రాలలో చేర్చాలో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారు. బీఎల్‌వో కేంద్రాల్లో తుదిజాబితాను అందుబాటులో ఉంచనున్నారు. నియోజకవర్గంలో 38మంది పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఉన్నతాధికారులకు నివేదించారు.

| మండలం | పురుషులు | మహిళలు | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|
| చారగొండ | 6240 | 5934 | 12175 |
| వంగూరు | 15782 | 15932 | 31714 |
| ఉప్పునుంతల | 14272 | 14525 | 28797 |
| అచ్చంపేట | 27828 | 27741 | 55570 |
| బల్మూర్ | 16983 | 16502 | 33485 |
| లింగాల | 14450 | 14464 | 28914 |
| అమ్రాబాద్ | 13428 | 13637 | 27065 |
| పదర | 8141 | 7704 | 15845 |
| మొత్తం | 1,17,124 | 1,16,439 | 2,33,565 |

# తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

లింగాల, అక్టోబర్ 4: గ్రామీణ ప్రాంతాల్లో తపాలా శాఖలో పని చేస్తున్న జీడీఎస్ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డివిజన్ అసిస్టెంట్ సెక్రటరీ బాలాజీనాయక్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక రోజు దేశ వ్యాప్తంగా చేపట్టిన జీడీఎస్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సబ్‌పోస్టాఫీస్ కార్యాలయం ఆవరణలో గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. బాలాజీనాయక్ మాట్లాడుతూ 2016 లో గ్రామీణ తపాలా ఉద్యోగులపని పరిస్థితుల వేతనాల పరిశీలన కోసం నియమించబడిన కమలేష్ చంద్ర కమిటీ రిపోర్టును అమలు పర్చకుండా కేంద్ర ప్రభుత్వం కావాలని, గ్రామీణ తపాలా ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. కమిటీ రిపోర్ట్‌లో సూచించిన విధంగా సీనియర్ జీడీఎస్‌లకు 12, 24, 36 సంవత్సరాల సర్వీస్‌కు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేస్తూ ఆర్థిక పరమైన ఉన్నతిని కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5లక్షలు,గ్రాట్యూటీ రూ.5లక్షలు పెంచుతూ పెయిడ్ లీవ్ 180రోజులకు పెంచాలన్నారు. రెగ్యులర్ జీడీఎస్ సెలువు రెట్టించినప్పుడు వర్క్ అప్‌లోడ్‌తో సంబంధం లేకుండా సబ్‌స్టూట్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు శివప్రసాద్, కొండయ్య, ప్రశాంత్, షకీల్, మమత, మనీషా, జయరాం, తరుణ్, తిరుపతిగౌడ్, ప్రవీణ్‌కుమార్, అక్రమ్, రాఘవేందర్, శంకర్ పాల్గొన్నారు.



సమ్మెలో మాట్లాడుతున్న బాలాజీనాయక్